# 6

## ప్రకెండుకు చూపిస్తూ!

నీలకంఠం నిరుద్యోగి. ఐతే నేమి? ఏదో గొప్ప వ్యాపకం ఉన్నవాడికి మల్లే రోజూ ఉదయమే ఊరమ్మట బయల్దేరి మూడు ఝాములైతేగాని ఇంటికి తిరిగిరాడు.

ఆనాడతడు వీథమ్మట వెడుతోంటే పార్వతమ్మ గుమ్మంముందు ముగ్గు పెట్టుకుంటూ చూచింది.

“ఎవరూ, నీలకంఠం అన్నయ్యేనా?” అని పలకరించింది.

“ఏం పార్వతమ్మా, చాలా సంతోషంతో కనపడుతున్నావీ రోజున? ఏమిటి విశేషం?”

“విశేషమేనయ్యా మరి, మా సీతకి పెళ్లి కుదిరింది.”

“శుభమస్తు—ఐతే...”

"ఏదో అడగబోయి, ఆగిపోయా వేం?"

"అడగబోయిన మాట నిజమే కాని మళ్లీ 'నా కెందుకు పోనిస్తూ' అని ఊరుకున్నాను...ఏం లేదూ, పెళ్లివారి దేవూరు?"

"ఏవూరో కా దన్నయ్యా, మన ఊరే...పరంధా మయ్యగారి అబ్బాయికే నిశ్చయం చేశాం. మన పిల్ల చీటికీ మాటికీ వస్తో పోతో ఉండటానికి వీలుగా ఉంటుందని ఈ ఊళ్ళో సంబంధానికి నేనే పట్టుబట్టేను."

" 'నేనే' అంటున్నావు, మీా ఆయనకి ఇష్టం లేదా?"

"ఇష్టం లేదని కాదు. కట్నంకానుకలకి వాళ్ళతో తూగలేమేమో అని మీా బావ కొంచెం వెనకదీశారు మొదట."

"ఐతే- నా కెందుకులే!"

"అదు గన్నయ్యా, సందేహించక."

"అబ్బే! ఏంలేదూ. 'కట్నం ఎంత?' అని అడగ బోయాను."

"నాలుగు వేలకి వప్పించాం. లాంఛనాలూ అమాం బాపతూ అందులోనే అనుకో."

"ఐతేమాత్రం నాలుగు వే లెందుకమ్మా? ... నా కెందుకులే ఇంతకీ?" అంటూ అడుగు వేశాడు నీలకంఠం.

"ఆగూ, వెళ్లిపోకు...ఐతే కట్నం ఎక్కువే పెట్టేశా మంటావా?"

"ఆ పరంధామయ్యకు ఏమున్నదని నాలుగు వేలు కట్నం పొయ్యడం?"

"ఏవో పెంకుటిల్లూ, భూమీ ఉన్నాయి కదుటోయ్?"

"పట్టుమని కాస్త తుఫానొస్తే ఎగిరిపోయే ఆ యిల్లు చూసేనా మురిసిపోతున్నావు పార్వతమ్మా? 'ఇల్లు' అన్నప్పుడు చెప్పతగ్గ మేడో, కాకపోతే కనీసం ఒక డాబావో ఐయుండాలి కాని ఆ పాత కొంపకూడా ఒక ఇల్లే అంటావా?"

"కొంపాగోడీమాట ఎలా ఉన్నా కుర్రవాడు తెలివైన వాడని మోజుపడ్డా మనుకో."

"నిజమేలే! ఎవళ్ళ మోజు వాళ్ళది! వెళ్ళొస్తా మరి" అని ముందుకు సాగేడు నీలకంఠం.

పార్వతమ్మ, "ఐతే కట్నం ఎక్కువే పెట్టేశాం అన్న మాట! కాస్త తమాయిస్తే పరంధామయ్యగారు మూడు వేలకే వప్పుకొని ఉండేవాడేమో" అన్న ఆలోచనలో పడింది.

## 2

నీలకంఠం పై వీధికి వెళ్ళేటప్పటికి అరుగుమీద కూర్చుని విశ్వనాథం కనపడ్డాడు.

"ఏమయ్యోయ్, విశ్వనాథం! ఏమిటలా దిగాలుపడి పోయి కూచున్నావు?"

"ఆడపిల్లలను కన్నవాళ్ళకి దిగాలు కాకేముందోయ్?"

"ఇప్పుడు.. నా కెందుకులే ఇంతకీ?"

"నీకంటే నా కాప్తు జెవరోయ్ నీలకంఠం? అడుగు అదేమిటో!"

"ఏం లేదూ! 'నీ కిప్పుడు పట్టుకున్న చింత యేమిటీ?' అని అడగబోయాను."

"చింతగా కేముందోయ్? మా కల్యాణికి ఎక్కడా వరుడు దొరకటం లేదు."

"దొరకాలంటే ఊరికే దొరుకుతాడుటోయ్? వరుడా మరొహడా? రూపాయల సంచులు దిమ్మరిస్తే కొండమీద కోతి దిగొస్తుంది. నీకు మల్లే డబ్బు చిక్కనైతే పనులు జరుగుతాయా? సంచీ మూతులు విప్పాలి! కట్నంకింద నోట్ల కట్టలు విసరాలి!...ఇంతకీ నా కెందుకులే!"

"కట్నం ఇవ్వనన్నానా నీలకంఠం? మూడు వేలిస్తా నన్నాను. పోనీ, నాలుగు వేలన్నాను, అంతకంటేనా?"

"చచ్చు నాలుగు వేలు! ఈ రోజులలో నాలుగు వేలు కూడా ఓ కట్నమేటోయ్? ఏమీ లేని అనామతుగాళ్లే ఆరు వేలడుగుతున్నారు."

"ఎద్దు పుండు కాకి కేమి నొప్పి?...నీ కేం బాబూ, నువ్వలాగే అంటావు."

"నిజం చెపుతే నిష్ఠూరమౌతుంది. అందుకే 'నా కెందుకు పోనిస్తూ' అని పోతోంటే పోనియ్యక నీ గొడవలోకి దింపేవు!"

"అది కాదు నీలకంఠం, సామాన్య సంసారినికదా, నేను ఆరువేలు ఎక్కడనుంచి తేగలను చెప్పు!"

"ఆరు వేలు కాకపోతే ఐదు వేలన్నా ఇవ్వాలి. నాలుక్కి వప్పుకున్నవాడివి మరో వెయ్యి సర్దుబాటు చేసుకోలేవూ?"

"ఇంతకీ ఐదు వేలిస్తే మాత్రం రెడీగా వరు డేడీ?"

"లేకేం? మీా వెనక వీధిలోనే ఉన్నాడు."

"ఎవరూ, పరంధామయ్య కొడుకు మాటా నువు చెపుతోంట? అతగాడికి పార్వతమ్మగారి సీత నిశ్చయమైందటగా?"

"నాల్గువేలే ఇస్తామన్నారు వాళ్ళు. నువ్వు మరో వెయ్యి ఇస్తానంటే పరంధామయ్య నీ సంబంధమే చేసుకుంటాడు."

ఆ మాట వినేసరికి విశ్వనాథం సంకోచిస్తూ, "ఐతే, నీలకంఠం, పార్వతమ్మగారి మీాద మనం పోటీకి వెడితే బాగుంటుందా? తాంబూలాలు పుచ్చుకున్నారనో, పుచ్చుకుంటారనో కూడా విన్నాను" అన్నాడు.

"పుస్తె కట్టేక కూడా పేచీలొచ్చి తెంపుకు చక్కాపోయిన పెళ్లిళ్ళెన్నో చూస్తున్నాం. ఈ కాలంలో తాంబూలాలు అడ్డొస్తాయిటోయ్ వెట్టివాడా!...ఇంతకీ నాకెందుకులే నీ గొడవ? పోయొస్తాను" అంటూ నీలకంఠం పై వీధికి నడిచాడు.

# 3

పరంధామయ్యగారు నీలకంఠాన్ని చూడటంతోనే పలకరించారు. "ఏమయ్యా, ఈమధ్య ఎక్కడా నువ్వు కంటికి కనిపించడమే లేదు?"

"మీ కంటికి కనిపించడమే లేదూ అంటే అది మీ నేత్రదోషం కాని నా తప్పేముంది పరంధామయ్యగారూ?"

"ఆరి, నీ తస్సర్ బడ్డా! నా కళ్ళకే దోషం ఆరోపించావూ!"

"యథార్థమే చెపుతున్నాను."

"నీ ఉద్దేశ మేదో బోధపడలేదు, నీలకంఠం! నా కళ్లు నెత్తిపై కొచ్చాయనా నువ్వనేది?"

"ఆమాట నే నన్నానా, పరంధామయ్యగారూ? 'నా బోటివాళ్ళని గమనించే స్థితిలో లేరు తమరు' అని ఊరికే ఛలోక్తిగా అన్నా నంతే. కోపగించుకోకండి."

"నీలాంటివాళ్ళనికూడా గమనించకుండా ఉండేటంత గొప్పతన మేమొచ్చిపడిందీ నాకూ?"

"గొప్పతనంకాక మరేమిటండీ? ఆరేసి వేలూ, ఏడేసి వేలూ కట్నా లిస్తామంటూ వస్తున్నారటగా మీ వరదారావుకి?"

"ఆరి నీ తస్సర్ బడ్డా! దానిమాటా నువ్వంటూన్నది? సరేకాని, ఆరు వేలూ, ఏడు వేలదాకా ఎక్కడోయ్? నాలుగు వేలకే త్రాహి త్రాహి ఐపోయినట్టుగా బీదార్పులు ఆర్చారు వాళ్లు."

"విశ్వనాథంగారే ఐదు వేలు ఇస్తానన్నాడుగా?"

"ఏ విశ్వనాథం?"

"మరేవిశ్వనాథ మండీ? మీ ముందు వీధిలో ఉన్నాయనే."

"నలివేటి విశ్వనాథం మాటా నువ్వు చెప్తోంటు? అతడు వాళ్ళమ్మాయి పెళ్ళి ప్రసక్తి ఎన్నడూ మావద్ద తీసుకు రాందే?"

"ముఖాముఖిగా మీ వద్ద తీసుకురాకపోతే మాత్ర మేమండీ? పరోక్షంగా వాకబులు చేస్తూనే ఉన్నాడుగా?"

"నాకు ఈ సంగతి కొంచెం కూడా ఎవరూ చెవిని వేశారు కాదే? ఎవరో ఎందుకూ, ఆ విశ్వనాథంగారే, 'నా కలాంటి అభిప్రాయం ఉన్నది సుమండీ' అని ఒక్క-మాట అంటే తీరిపోనుగా?"

"తీరా అడుగుతే మీరు ఏ ఎనిమిది వేలో తెమ్మంటా రని భయం వేసి సాహసించలేక పోతున్నాడు."

"ఎందుకోయ్ అంత భయం? వాళ్ళ వాళ్ళ సరదా కొద్దీ ఇస్తామన్న దేదో పుచ్చుకోవడమేగాని కట్నంకోసం నిఘా చేసే మనిషిని కాను నేను."

"విశ్వనాథంతో ఆమాటే అన్నాను నేను. 'ఐదు వేలకు వప్పుకుంటారా?' అన్నాడు. 'అడిగి చూడు' అని సలహా ఇచ్చాను."

"ఐతే విశ్వనాథంగారు మాయింటికి వస్తాడంటావా పెళ్ళిమాటలకి?... ఈ సంగతి నిన్ననే తెలుస్తే ఎంత బాగుండి పోను!"

"ఏం? ఇప్పుడుమాత్రం మించిపోయిం దేమిటి?"

"ఒహాళ్ళ కప్పుడే మాట ఇచ్చేశానయ్యా ఖర్మం!"

"మాటేకదా ఇస్తే? మూటపోయినట్లు విచారించడం

దేనికి?—వెళ్ళొస్తా మరి," అని అడుగు వేశాడు నీలకంఠం. పరంధామయ్యగారు ఏడుపుమొహం పెట్టి, "వెళ్ళిపోకయ్యా, నీలకంఠం! నన్ను ఇలా నడిప్రవాహంలో వదిలేసిపోతా నంటా వేమిటి? ఆగు!" అని ప్రాధేయపడ్డాడు.

"అదేమిటి పరంధామయ్యగారూ! నా దారిని నేను పోతోంటే పోనియ్యక ఆపి, ఉత్తి పుణ్యాన్ని నాకంత పాపం అంటకడుతున్నారు దేనికి? 'నడిప్రవాహం' అంటో నట్టేట కొట్టుకుపోతూన్నవాడికి మల్లేనే మాటాడుతున్నారే!"

"అదికాదోయ్. నాలుగు వేలు కట్నానికి వప్పుకుని నిన్ననే ఒకళ్ళకి మాట ఇచ్చేశాను. ఇప్పుడు విశ్వనాథంగారికి ఐదు వేలదాకా ఇచ్చే ఉద్దేశం వున్నదని చెపుతున్నావు నువ్వు. ఏమిటి చెయ్యడం అన్న సందిగ్ధంలో పడిపోయాను."

"మీరే ఓ నిర్ణయానికి రావాలికాని నేనేం చెయ్యను?"

"ఏదో ఆలోచన చెప్పాలిగాని 'నాకెందుకు' అన్నట్టుగా చక్కాపోతే ఎలాగోయ్ నీలకంఠం?"

"ఆలోచన కేముందండీ? నాలుగు వేలకీ, ఐదు వేలకీ తేడా వెయ్యిరూపాయలు కదా. వెయ్యిరూపాయ లెక్కువా, ఒక్క మాట ఎక్కువా అని ఆలోచించుకోండి—పోతా మరి. మూడుర్ఘాముదైంది. మా ఆవిడ కనిపెట్టుకునుంటుంది."

## 4

సరిగా వారమైంది. నీలకంఠం మళ్ళీ పార్వతమ్మగారి ఇంటి ముందు నుంచే వెడుతున్నాడు. ఆమె మళ్ళీ గుమ్మంముందు

ముగ్గు పెడుతోనే కనపడింది. కాని అంతకుముందు ఆమెలో ప్రత్యక్షమైన సంతోషం మాత్రం కనపట్టం లేదు.

"విన్నావా అన్నయ్యా, ఏం జరిగిందోను? ఆ విశ్వనాథం ఇంకో వెయ్యి ఎక్కువ ఇస్తానంటూ మా మీద పోటీగా పరంధామయ్యగారికి కబురు చేశాట్ట!"

"పరంధామయ్య ఆ వెయ్యికీ కక్కుర్తిపడి అటే మొగ్గేడా ఐతే?" అని ప్రశ్నించాడు.

"నీతిలేనివాడు మొగ్గ కేం చేస్తాడయ్యా? ఏ గడ్డి తిన మంటే ఆ గడ్డి తింటాడు!"

'బాగా చెప్పేవ్!' అని మెచ్చుకున్నాడు నీలకంఠం.

"చెప్పడం కాదోయ్; నువ్వొకసారి వెళ్ళి ఈ లుచ్ఛా విశ్వనాథాన్నీ, ఆ దగుల్బాజీ పరంధామయ్యనీ నిలబెట్టి ఈ దవడా ఆ దవడా వాయించి, 'ఇదేం పనర్రా తుచ్ఛుల్లారా?' అని మొహాలు తగలెయ్యాలి!"

"నేనా పార్వతమ్మా? నేను కలుగచేసుకుంటే 'నీ కెందుకు పోనిస్తూ?' అనేస్తారు కాని దారికి వస్తారుటమ్మా?"

"ఏం చెయ్యమంటా వన్నైతే?"

"నష్టపడ్డదానివి గనుక నువ్వే వాళ్ళ పని పట్టాలి! చెపుతా విను...ఓ కొబ్బరి చీపురు పుచ్చుకుని మొదట ఆ విశ్వనాథంగాడి ఇంటికి వెళ్ళు...'మా మీద పోటీకి వెడతా వట్రా వెధవా?' అంటూ ప్రారంభించు. తెలివైనవాడైతే తలుపులు బిడాయించుకుని లోపలే ఉండిపోతాడు! అలా ఉండడూ! నీ చీపురుదెబ్బ ధాటీ ఎట్టిదో రుచిచూపించు!...

ఆ పరంధామయ్య ఇంటికి కూడా వెళ్లి ఆ మర్యాదే వాడికీ చెయ్యి."

ఆ మర్నాడు నీలకంఠం ఎదురైనప్పుడు విశ్వనాథం, 'విన్నావా?' అన్నాడు.

"పార్వతమ్మ హంగామా మాటేనా?"

"హంగామా ఏమిటోయ్? అడ్డమైన తిట్లూ, శాపనార్థాలూ పెట్టి పోయింది!"

"నువ్వు అన్నీ పడి ఊరుకున్నావన్న మాట!"

"ఊరుకోక ఏం చెయ్యమన్నావ్?"

"అది నీ ధైర్యాన్ని బట్టి ఉంటుంది."

"ఐన దేదో ఐంది. ఈ పరిస్థితుల్లో ఇంక మళ్లీ పరంధామయ్యగారితో సంప్రదించడం మంచిదంటావా?"

"సంప్రదించక? ఈ మాత్రందానికే బెదిరిపోతావా మరి?"

"బెదిరిపోవడం కాదయ్యా! పార్వతమ్మ అలా శాపనార్థాలు పెట్టిపోయాక మనం ఇంకా పోటీకి వెళ్లి పెళ్లి చెయ్యడం మన పిల్లకి క్షేమమా అనిపిస్తోంది."

"నేనేం చెప్పను? నా స్వభావం నీకు తెలుసుగా? ఒహాళ్ల గొడవల్లో నేను జోక్యం కలుగజేసుకోను." అంటూ నీలకంఠం అడుగు. వేశాడు.

రెండు రోజులు గడిచాక కాని నీలకంఠం పరంధా

మయ్యగారి ఇంటివైపు వెళ్ళలేదు. వెళ్ళినప్పుడు కూడా ఆయ నను గమనించనట్టే వీధమ్మట చరచరా నడిచాడు.

"ఎవరూ, నీలకంఠమేనా? రావోయ్" అని పిలిచాడు పరంధామయ్య.

"పనిమీద వెడుతున్నానండీ!"

"ఆగవోయ్, ఒక్క నిముషం."

"ఏమిటి విశేషం? అలాగున్నారేం?"

"తెలియలేదా నీకింకా?"

"ఏ విషయం?"

"విశ్వనాధంగారు కబురుచేశాడు."

"ఏమని?"

"'మీ సంబంధం చేసుకోము' అని."

"పార్వతమ్మ నోటికి జడిసిపోయాడన్నమాట!"

"అతనంటా వేమిటి, నేనే హడలిపోతేను?"

"ఐతే ఆవిడ మీ యింటికీ వచ్చిందన్నమాట!"

"రానడ మేమిటోయ్, మహాంకాళిలాగ తైతక్కలాడి పోతేను?"

"కాంతాకరవాలం కూడా పట్టుకొచ్చిందా?"

"చీపురుకట్ట మాటేనా నువ్వనేది? ఐతే ఆవిడ రావడం చూశావన్నమాట... మేము ఆవిడశాపనార్థాలు వినలేక తలుపులు వేసుకుంటే మా మీద కోపమంతా ఆ చీపురుతో మా తలుపులమీద చూపించి చక్కా పోయింది! చూడు చీపురు మరక లెలా పడ్డాయో!"

"కాబోయే వియ్యపరాలు ప్రతిభ గమనించా రన్న మాట!"

"ఛస్, ఆ శూర్పణఖనా నా వియ్యపరా లంటు న్నావ్?"

ఆ రాత్రి కృష్ణవేణమ్మ నీలకంఠానికి అన్నం వడ్డిస్తో, "పాపం! పార్వతమ్మగారి సీత పెళ్లి ఆగిపోయింది సుమండీ" అన్నది. నీలకంఠం ఏమీ ఎరగనట్టు, 'ఎందుచేత?' అన్నాడు.

"పరంధామయ్యగారు 'మరే సంబంధం దొరకక—పోతే నా కొడుకు బ్రహ్మచారిగానే ఉండిపోతాడు గాని నీ సంబంధం మాత్రం చేసుకోను!' అనేశాట్ట!"

"బ్రహ్మచారిగా ఉండటమే మంచిదిలే. ఏమంటావా, జనాభా పెరిగిపోతోందిట!"

"అతగాడికేం? లక్ష సంబంధాలొస్తాయి. ఆ పిల్ల మాటేమి టంటాను!" అని సానుభూతి చూపిందా ఇల్లాలు.

"ఎవళ్ళ ఖర్మం వాళ్ళది! మన కెందుకు పోనిస్తూ!" అన్నాడా గరళకంఠం.